

సత్యదేవుని దర్శించుకున్న సుప్రీంకోర్టు జడ్జిలు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఐదుగురు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు సంజయ్‌కుమార్, రాజేష్ బిందాల్, ఎస్‌విఎం బట్టి నరసింహ, విశ్వనాథ్‌లకు దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో అధికారులు ఆలయ లాంచనాలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. వారికి స్వామివారి జ్ఞాపికను ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, పిఆర్ఒ కృష్ణారావు పాల్గొన్నారు.


కొండపైకి వస్తున్న సుప్రీంకోర్టు జడ్జిలు

కోడిదే పైచేయి

- ఉమ్మడి జిల్లాలో భారీగా బరులు
- పోలీసుల హెచ్చరికలు, ఆంక్షలు బేఖాతరు
- రూ.కోట్లలో చేతులు మారిన నగదు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

పోలీసులపై ఎప్పటిలానే ఈ సారి కూడా కోడే పైచేయి సాధించింది. నెల రోజులుగా పోలీసులు చేస్తున్న హెచ్చరికలు, పెట్టిన ఆంక్షలు ఎక్కడా అమలైన దాఖలాలు లేవు. ఫలితంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 450కి పైగా బరులు వెలశాయి. వందల కొద్దీ కోడి మెడలు తెగిపడ్డాయి. తొలి రోజు రూ.100 కోట్ల వరకూ చేతులు మారినట్టు అంచానా.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపుగా అన్ని మండలాల్లో తొలిరోజే ప్రతి మండలంలోనూ 5 నుంచి 10 వరకూ బరులు వెలశాయి. ఒకొక్క పందెం రూ.50 వేల నుంచి మొదలై రూ.లక్షల వరకూ సాగింది. ఈ ఏడాది బరుల నిర్వహణలో అధికార పార్టీదే పైచేయిగా నిలిచింది. గతంలో ఆసక్తి ఉన్న వారంతా పార్టీలకతీతంగా బరులు ఏర్పాటు చేసుకునేవారు. ఇప్పుడు అధికార పార్టీ నేతల ఆశీస్సులుంటేనే పందేలకు అవకాశం లభించింది. డిప్యూటీ సిఎం ఇలాకా అయిన పిఠాపురం, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇలాకాల్లో సైతం తొలిరోజే వందల సంఖ్యలో కోడి పందేలు జరిగాయి.

కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో ఈసారి కోడి పందాల నిర్వహణకు ఆంక్షలు కఠినంగా వుంటాయని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. పోలీసులు గత నాలుగు రోజులుగా విస్తతంగా ప్రచారం చేశారు. కాకినాడ జిల్లాలో కాకినాడ రూరల్, సామర్లకోట, కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు, దేవరపల్లి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అంబాజీపేట, సఖినేటిపల్లి, మండపేట, రాయవరం తదితర మండలాల్లో చిన్న బరులపై తమ ప్రతాపాన్ని చూపగలిగారు. కోడి కత్తులు కట్టే పలువురిని బైండోవర్ చేశారు. మరికొందరిని అరెస్టు చేసి వందలాది కత్తులను స్వాధీనం చేసుకున్నారు. పందేలకు స్థలాలను ఇచ్చే యజమానులను ముందస్తుగానే హెచ్చరించారు. ఇలా అన్ని రకాలుగా పోలీసులు హెచ్చరికలు చేసినా భోగి నాడు అవన్నీ మంటల్లో కలిసిపోయాయి. శనివారం నుంచే పలు చోట్ల బరులు సిద్ధం కాగా భోగి పండగ అయిన సోమవారం నుంచి జోరుగా పందేలు మొదలయ్యాయి.


పిఠాపురంలోని వైఎస్ఆర్ గార్డెన్స్‌లో బరిలో జరుగుతున్న పందెం, పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు


పిఠాపురం ఎఫ్‌కె.పాలెంలో టిడిపి, జనసేన కార్యకర్తల బాహాబాహీ

పోలీసులపై కూటమి నేతలు ఒత్తిళ్లు?

కూటమి ప్రజాప్రతినిధులు, కూటమి ముఖ్య నేతల నుంచి వచ్చిన అనధికార అదేశాలతో పోలీసులు తలొంచక తప్పలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం మండలంలోని సమనస, వన్నెచింతలపూడి, సవరప్పాలెం, తాండవపల్లి, బండారులంక, ఇందుపల్లి, చిందాడగరువు, గున్నేపల్లి అగ్రహారం, మామిడికుదురు, అల్లవరం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కొత్తపేట, మల్కిపురం, అంబాజీపేట, రాజోలు ఇలా పలు చోట్ల పందేలు జోరందుకున్నాయి. కాకినాడ జిల్లా కాకినాడ సిటీ,రూరల్ పరిధిల్లో బరుల్లో పందాలు సాగుతున్నాయి. మెట్ట ప్రాంతాలయిన కరప, పిఠాపురం, గొల్లప్రోలు, ఏలేశ్వరం,తుని, రాజనగరం, గండేపల్లి, కత్తిపూడి, శంఖవరం, జగ్గంపేట ఇలా చిన్న పెద్ద అన్నీ కలిపి దాదాపు 450 బరుల్లో పందాలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా కోనసీమలో 20 ప్రాంతాల్లో కీలక బరుల్లో పందేలు, గుండాట, మద్యం అమ్మకాలు సాగుతున్నాయి.

పార్టీల నేతలే నిర్వహకులు

స్వయానా పందేలను ప్రజాప్రతినిధులే ప్రారంభించడం విశేషం. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం వాకతిప్పలో కోడిపందేలను ప్రారంభించారు. అలాగే కాకినాడ రూరల్ జనసేన ఎంఎల్ఎ పంతం నానాజీ కూడా తన నియోజకవర్గం పరిధిలో ఉన్న ఒక బరిలో పందేలను ప్రారంభించడం చర్చనీయాశంగా మారింది. మరోవైపు అన్ని చోట్లా అధికార టిడిపి, జనసేన నేతలే నిర్వాహకులుగా వ్యవహరిస్తున్నారు. పందేలు, గుండాట నిర్వహణకు రూ. లక్షల్లో సొమ్ములు వసూలు చేసినట్టు వార్తలు వినిపిస్తున్నాయి.

జనసేన, టిడిపి బాహాబాహి

కూటమి పార్టీల నేతలు అధికారంలో ఉండడంతో పలుచోట్ల పోటాపోటీగా బరులు వెలిశాయి. టిడిపి, జనసేన కార్యకర్తలు వేరువేరుగా బరులను సిద్ధం చేసి పందేలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో కొన్ని చోట్ల ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని ఫక్రుద్దీన్ పాలెంలో తొలిరోజు టిడిపి, జనసేన కార్యకర్తలు మధ్య కోట్లాట జరిగింది. పిఠాపురం పట్టణంలో విడిగా ఏర్పాటు చేసిన టిడిపి బరిలో ఓడిపోయిన కోడి పుంజును కింద పడకుండానే తీసేసారని పెద్ద ఘర్షణ వాతావరణం నెలకొంది. కొందరు యువకులు బాహాబాహీకి దిగారు. నిర్వాహకులు, నాయకులు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది.


కాకినాడలో భోగి మంటలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

భోగిమంటల్లో విద్యుత్ బిల్లుల దహనం

ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే పెంచిన ఛార్జీలను తగ్గించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ నగరంలోని 37వ డివిజన్‌లో ఉన్న సుందరయ్య భవన్ వీధిలో విద్యుత్ బిల్లులను భోగి మంటలో వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జీ, నగర కమిటి నాయకులు కె.సత్తిరాజు మాట్లాడుతూ మాట్లాడారు. గత ప్రభుత్వం అవలంభించిన విధానాలనే ఈ ప్రభుత్వం కూడా అమలు చేస్తుందన్నారు. అదానీతో జగన్ కుదుర్చుకున్న ఒప్పందాలు చంద్రబాబు అమలు చేయడం వల్లనే స్మార్ట్ మీటర్లు రంగంలోకి వచ్చాయన్నారు. ప్రజలపై వివిధ రూపాల్లో వేస్తున్న విద్యుత్ భారాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు ఉపసంహరించుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకురాలు జి.బేబిరాణి, నగర కన్వీనర్ పలివెల వీరబాబు, కమిటీ సభ్యురాలు కె.నాగజ్యోతి, చంద్రమళ్ళ పద్మ, నర్ల ఈశ్వరి, మేడిశెట్టి వెంకటరమణ, జి. భూలక్ష్మి, గౌరి, లోవ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** పట్టణంలో పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని వమ్ము చేస్తూ కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంపుదల చేసిందన్నారు. ఎన్నికల ముందు వైసిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పెంపుదలను నిరసిస్తూ చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్‌లు బాదుడే బాదుడు అంటూ ప్రచారం చేశారన్నారు. అదేరీతిలో నేటి కూటమి ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీల పేరుతో వినియోగదారుల నుంచి ముక్కు పిండి మరి వసూలు చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు, నాయకులు సిరపరపు మరిడియ్య, దారపురెడ్డి కృష్ణ, నెక్కల నరసింహ మూర్తి, రొంగల సుబ్బలక్ష్మి, కూనిరెడ్డి అప్పన్న తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** రూరల్ మండలం చీడిగ గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పెద్దింశెట్టి రామకృష్ణారావు, జుత్తుగ శ్రీనివాసరావు, లోవరాజు పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక రామా థియేటర్ సెంటర్‌లో సిపిఎం నాయకుడు కె.చిన్న ఆధ్వర్యంలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి దహనం చేశారు. అలాగే ఉప్పాడ బస్ స్టాండ్‌లో సిపిఎం శాఖ కార్యదర్శి కొనేటి రాజు ఆధ్వర్యంలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేశారు. అలాగే మల్లాం గ్రామంలో సిపిఎం నాయకులు కె.సింహాచలం ఆధ్వర్యంలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు జి.వీరబాబు, వి.సూర్యనారాయణ, డి.సత్యనారా యణ, డి.గోపాలకృష్ణ, ఎం సూరిబాబు, నాగేశ్వర రావు, స్టాలిన్, కె.నాగవెంకటలక్ష్మి, డి.నాగబాబు, జి.ధర్మరాజు పాల్గొన్నారు.


పిఠాపురం మండలం మల్లాంలో బిల్లుల దహనం

ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - సామర్లకోట

దేవాలయాల వద్ద దివిస్ కంపెనీ ఆర్ఒ ప్లాంట్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సోమవారం స్థానిక భీమేశ్వర ఆలయం వద్ద దివీస్ కంపెనీ రూ.18 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రముఖ దేవాలయాల వద్ద దివిస్ కంపెనీ ఆర్ఒ ప్లాంట్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. దివిస్ లేబరటరీస్ సీనియర్ మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ మొట్టమొదటిగా తెలంగాణలో ఒక ఆలయం వద్ద ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేశామని, భక్తుల నుంచి ఎంతో స్పందన రావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలోని ప్రముఖ దేవాలయాల వద్ద ఆర్ఒ ప్లాంట్లను రూ.4 కోట్లతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ వెల్ఫేర్ ఆఫీసర్ వాసుబాబు, ఇఒ బళ్ల నీలకంఠం, ఆలయ ట్రస్ట్ బోర్డ్ మాజీ ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గోలి వెంకటఅప్పారావుచౌదరి, సెవెన్ హిల్స్ ఎండి పసల పద్మరాఘవ రావు, పాల్గొన్నారు.



ఆర్ఒ ప్లాంట్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న చినరాజప్ప

ముగ్గుల పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి - పెద్దాపురం

డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, పిఎన్ఎం, పిసిసి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. సోమవారం స్థానిక నువ్వుల గుంట వీధి, సుందరయ్య కాలనీ, వరహాలయ్య పేట, కృష్ణుని గుడి సెంటర్‌లలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పోటీలకు యుటిఎఫ్ నాయకులు జయశ్రీ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు కూనిరెడ్డి అరుణ, రొంగల సుబ్బలక్ష్మి, సిఐటియు నాయకులు కరక సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నా మన్నారు. ఈనెల 14వ తేదీన జరిగే బహుమతి ప్రధానోత్సవ సభలో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గాడి సత్యవతి, సిరపరపు శ్రీనివాస్, పిసిసి కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్, పిఎన్ఎం నాయకులు దారపురెడ్డి కృష్ణ, మహపాతిన రాంబాబు, అమృత, నమ్రత, బంగారురాజు, క్రాంతికుమార్, కూనిరెడ్డి అప్పన్న పాల్గొన్నారు.


ముగ్గుల పోటీలో పాల్గొంటున్న మహిళలు

విజేతలకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి - రౌతులపూడి

సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మండలంలోని బలరామపురంలో చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. మాజీ సర్పంచ్ దాసరి తాతాజీ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలతోపాటు, పోటీలో పాల్గొన్న మహిళలకు సర్పంచ్ పైల సీత, ఎంపిటిసి సభ్యులు సోమరౌతు రవి, మాజీ సర్పంచ్ పైల పైడ్రాజు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కెవి.రమణ, దాసరి ముసలయ్య పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందచేస్తున్న నాయకులు

లయన్స్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతి పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ జరిగింది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు మాట్లా డారు. ఈ కార్యక్రమంలో నాగ సత్యశ్రీనివాస్, ఎడివి.ప్రసాద్, ఊర రాజబాబు, గురవయ్య, నర్ల చిదంబరం పాల్గొన్నారు.



మహిళకు దుప్పటి పంపిణీ చేస్తున్న లయన్స్ సభ్యులు

మరిడమ్మ ఉత్సవ మండపం ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయం వద్ద రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన ఉత్సవ మండపాన్ని ఎంపి తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్, ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చినరాజప్ప మాట్లాడుతూ యాత్రికులకు అన్ని రకాలుగా ఉపయోగపడే ఈ ఉత్సవ మండపం నిర్మాణానికి సహకరించిన వారందరినీ ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, కూటమి పార్టీల నాయకులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, తూతిక నాగు, పొలమరశెట్టి సత్తిబాబు, లక్ష్మణ దివాకర్, దాతలు మట్టే శ్రీనివాస్, వేముల సతీష్, పానంగిపల్లి చలపతిరావు, మండవిల్లి శ్రీనివాస ముత్యాలు, పాలకుర్తి రాజేష్, రమణమూర్తి పాల్గొన్నారు.


మండపాన్ని ప్రారంభిస్తున్న ఎంపి తంగెళ్ల, ఎంఎల్ఎ చినరాజప్ప

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - పిఠాపురం

ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరు ఖచ్చితంగా పాటించాలని సిఐ జి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక ఉప్పాడ బస్టాండ్ సెంటర్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. త్రిబుల్ రైడింగ్ చేస్తున్న వారిని, డ్రైవింగ్ లైసెన్సు లేని వాహన దారులకు అపరాధ రుసుము విధించారు. తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు ఆయన తెలిపారు. వాహనాలు నడిపే మైనర్లుకు వారి తల్లిదండ్రులు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు, సురక్షితమైన డ్రైవింగ్ గురించి తగు జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మణికుమార్, జాన్ భాషా, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సిఐ శ్రీనివాస్


సంక్రాంతి వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

నియోజక వర్గ పరిధిలో భోగి మంటలతో సంక్రాంతి వేడుకలను ఘనంగా ప్రారంభం అయ్యాయి. సోమవారం వేకువజాము 4 గంటలకే ప్రజలు ప్రధాన కూడళ్లలో భోగి మంటలను ఏర్పాటు చేసి స్నానాలాచరించి మంటల్లో భోగి పిడకలు వేసి ఆనందంగా కుటుంబాలతో గడిపారు. హరిదాసు పాటలు, గంగిరెద్ల దీవెనలు, జంగమ దేవర పాటలు ప్రజలను ఆకట్టుకున్నాయి.


భోగి మంట వద్ద ప్రజలు

కార్టూ'నిజం'



కత్తులు దూసిన కోళ్లు

- -ఫ్లడ్ లైట్లు, ఎల్ఇడి స్క్రీన్స్ ఏర్పాటు
- -బందోబస్తు కోసం ప్రత్యేక సిబ్బంది
- -న్యాయస్థానాల హెచ్చరికలు భేఖాతరు

న్యాయస్థానాల ఆదేశాలు భేఖాతరు అయ్యాయి. భోగి రోజు ఉదయం నుంచే పందెం కోళ్లు కత్తులు దూశాయి. బరుల వద్ద ఫ్లడ్ లైట్స్, ఎల్ఇడి స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. బందోబస్తు కోసం ప్రత్యేకంగా ప్రయివేటు సెక్యూరిటీ సిబ్బందిని నియమించారు. జిల్లాలోని ప్రతీ గ్రామంలోనూ సోమవారం కోడి పందేల యథేచ్ఛగా జరిగాయి. బరుల నిర్వహణలో టిడిపి, జనసేన నాయకులు పోటీలు పడ్డారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

పిఠాపురం డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ఇలాకాలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు యథేచ్ఛగా కూటమి పార్టీల నేతల కనుసన్నల్లో జోరుగా ప్రారంభం అయ్యాయి. పిఠాపురం పట్టణ, మండలంలో కోడి పందేలు యథేచ్ఛగా జరిగాయి. బరుల చుట్టూ ఫెన్సింగ్, ప్లండ్ లైట్స్, ఎల్ఇడి స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. స్థానిక వైఎస్ఆర్ గార్డెన్స్‌లో జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన బరిలో నిర్వహించిన కోడి పందేలను ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ వీక్షించారు. టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బరిని మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎస్.వర్మ ప్రారంభించారు. కోడి పందేలతోపాటు, గుండాట బోర్డులను ఏర్పాటు చేశారు. పందేలను తిలకించేందుకు పిల్లలతోపాటు, తల్లులు బరుల వద్దకు రావడం విశేషం. ఎఫ్‌కె పాలెం గ్రామంలో బరి వద్ద టిడిపి, జనసేన కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. వైఎస్ఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటుచేసిన బరి విషయంలో టిడిపి, జనసేన మధ్య వివాదం రేగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకుంది. **యు.కొత్తపల్లి** మండలంలో కొత్తపల్లి, వాకతిప్ప, నాగులపల్లి, కొండవరం తదితర గ్రామాల్లో కోడిపందేలు, గుండాట యథేచ్ఛగా జరిగాయి. వాకతిప్ప గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాల ఎదురుగానే కోడి పందేలు, గుండాట నిర్వహించారు. గత వారం రోజులుగా పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసిన అధికార యంత్రాంగం ప్రభుత్వ కార్యాలయాల ఎదురుగా జూద క్రీడలు నిర్వహించినా పట్టించుకోకపోవడం విశేషం. **తుని, కోటనందూరు** పట్టణంతోపాటు, మండలంలోని ఉప్పరగూడెం, ఎస్.అన్నవరం, తేటగుంట, రాజుపేట ప్రాంతాల్లో ఫ్లడ్ లైట్ల వెలుగులో కోడి పందేలు, గుండాట, పేకాట వంటి జూదాలు యథేచ్ఛగా జరిగాయి. భోగి పండుగ ఒక్కరోజులోనే సుమారు 70 లక్షల పైగా ఆర్థిక లావాదేవీలు జరిగాయి. కోటనందూరు మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందాలు నిర్వహించారు. **సామర్లకోట** మండల పరిధిలో అదినాతన టెక్నాలజీతో కోడిపందేలు నిర్వహించారు. జి.మెడపాడు, అచ్చంపేట, ఉండూరు, వికె.రాయపురం, పనసపాడు, జి.కొత్తూరు, చంద్రపాలెం గ్రామాల్లో భారీ స్థాయిలో బరులు ఏర్పాటు చేసి కోడిపందాలు నిర్వహించారు. జి.మేడపాడులో ఎల్ఇడి స్క్రీన్స్ ఏర్పాటుచేయడంతోపాటు, ఫోన్ పే ద్వారా సొమ్ములు అందజేస్తామని నిర్వహకులు ఫ్లెక్సీని ప్రదర్శించారు. శిబిరాల వద్ద జోరుగా మద్యం విక్రయాలు చేపట్టారు. వికె.రాయపురం బరి వద్ద స్వల్ప వివాదం చోటుచేసుకుంది. ఇక్కడ 11 కెవి లైన్ ద్వారా విద్యుత్‌ను వినియోగించారు. సాయంత్రం 6 తరువాత ఫ్లడ్ లైట్ల వెలుతురులో పందేలు కొనసాగాయి. **పెద్దాపురం** మండలంలో అన్ని గ్రామాల్లో కోడి పందేలు, గుండాట, పేకాట వంటి జూదాలు యథేచ్ఛగా జరిగాయి. పోలీసులు ఎంతగా హెచ్చరికల జారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధుల అండదండలతో జూదాలు సాగాయనే విమర్శలు ఉన్నాయి. **రౌతులపూడి** మండలంలోని లచ్చిరెడ్డిపాలెం, గంగవరం, పారుపాక, ములగపూడి తదితర గ్రామాల్లో కోడిపందాలు జోరుగా నిర్వహించారు.


సామర్లకోటలో పందెం బరిలో తలపడుతున్న కోళ్లు


కాకినాడ రూరల్ సర్పవరంలో జోరుగా గుండాట


సామర్లకోట బరి వద్ద ఏర్పాటు చేసిన స్క్రీన్

కోనసీమ ఖ్యాతి ప్రభవించేలా...

- ఏటా కనుమ రోజు ఉత్సవం
- సిద్ధమవుతున్న ప్రభలు
- ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - అంబాజీపేట

కోనసీమ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది ప్రభల తీర్థం. సంక్రాంతి పండుగలో భాగంగా ఏటా కనుమ రోజు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి 430 ఏళ్ల చరిత్ర ఉంది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం జగ్గన్నతోటలో జరిగే ఈ వేడుకను చూసేందుకు ప్రతి ఏటా వేలాది మంది తరలి వస్తుంటారు. దీనికి జాతీయ స్థాయి గుర్తింపు సైతం ఉంది. గతేడాది గణతంత్ర వేడుకల్లో రాష్ట్రానికి చెందిన శకటంపై కోనసీమ ప్రభలు కొలువుదీరి దేశప్రజలను ఆకట్టుకున్నాయి.

కోనసీమ ప్రభల తీర్థాల చరిత్ర

పెద్దాపురం సంస్థానాదీసుడు రాజవత్సాయి జగన్నాథరాజు (జగ్గన్న) హయాంలో తొలిసారిగా ఈ ప్రభల తీర్థాన్ని మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో నిర్వహించారు. వీటితో పాటు మండల పరిధిలో వాకలగరువు, మాచవరం, చిరతపూడి(డ్యామ్‌సెంటర్) లలో ఏటా ప్రభల తీర్థాలు నిర్వహిస్తున్నారు. జగ్గన్నతోట తీర్థానికి ప్రాముఖ్యత ఉంది. వ్యాఘ్రేశ్వరం నుంచి తరలివచ్చే వాఘేశ్వరస్వామి అధ్యక్షతన కె.పెదపూడి మేనకేశ్వర స్వామి, గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి, గంగలకుర్రు చెన్నమల్లేశ్వర స్వామి, ముక్కామల రాఘవేశ్వర స్వామి, మొసలపల్లి మధుమానంతర భోగేశ్వర స్వామి, పాలగుమ్మి చెన్న మల్లేశ్వర స్వామి, ప్రభలు తరలివచ్చి జగ్గన్నతోటలో ఏకాదశి రుద్రుల పేరుతో కొలువు దీరుతాయి. వరి చేల నుంచి అప్పర కౌశికను దాటుకుంటూ వచ్చే సుందర దృశ్యాలను చూసేందుకే వేలాదిగా ప్రజలు అక్కడికి చేరుకుంటారు. అన్ని ప్రభల కంటే ముందుగా మొసలపల్లి ప్రభ కొలువుతీరి ఆహ్వానం పలుకుతుంది.

ఎత్తైయిన ప్రభ వాకలగరువు

వాకలగురువు, తొండవరం, గున్నేపల్లి గ్రామాలకు కేంద్ర బిందువుగా ఉండే వాకలగరువు(జంక్షన్ రావి చెట్టు సెంటర్) వద్ద సంక్రాంతి రోజున ఏర్పాటు చేసే ఎత్తైన ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. వాకలగరువు సోమేశ్వరస్వామి, తొండవరంలో తొండేశ్వర స్వామి ఆలయ కమిటీలు పోటీపడి 50 నుంచి 60 అడుగుల అతిపెద్ద వైన ప్రభలను మూడురోజుల పాటు సుమారు 30 మంది తయారు చేస్తారు. వీటినికొబ్బరి తోటల నుంచి తీసుకురావటం ఆకర్షణీయంగా నిలుస్తుంది.



ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



ప్రభలు రాకపోకల సమయాల్లో జనం రద్దీ కారణంగా తొక్కిసటలాట జరగకుండా ప్రశాంత వాతావరణంలో ప్రభల ఉత్సవాన్ని జరుపుకోవాలి. ప్రజలు ఇబ్బందులు పడకుండా ట్రాఫిక్ ఇబ్బందులు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకునేలా నలుగురు సిఐలు, 18 మంది ఎస్‌ఐలు, ఆరుగురు ఎఎస్‌ఐలు, 55 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 182 మంది కానిస్టేబుళ్ల, 47 మంది హోం గార్డులతో బందోబస్తు ఏర్పాటు చేశాం.

- ఆర్. భీమరాజు, సిఐ, పి.గన్నవరం

'ప్రభ'లతో తరతరాల అనుబంధం...



తొండవరం, వాకలగరువు గ్రామాల ప్రభలతో ఇక్కడి ప్రజలకు తరతరలా అనుబంధం ఉంది. వాకలగరువు రావిచెట్టు జంక్షన్‌లో జరిగే ప్రబల తీర్థం వీక్షించేందుకు విదేశాలు, వివిధ రాష్ట్రాల్లో ఉన్న వారంతా తొండవరం చేరుకుంటారు. ఈ తీర్థంతో పాటు జగ్గన్నతోట తీర్థానికి వెళ్తారు. మూడు రోజులు పాటు సుమారు నలబైమంది భక్తి శ్రద్ధలతో ఈ ప్రభలను ఎంతో కష్టపడి తయారు చేస్తారు.

- పేరాబత్తుల రామలింగరాజు (దొరబాబు), సర్పంచ్, తొండవరం

లోకల్ వెలవెల

- పండుగ వ్యాపారానికి ఆన్‌లైన్ వల
- ఆఫర్లతో ఆకర్షిస్తున్న కార్పొరేట్ షాపింగ్ మాల్స్
- స్థానిక వ్యాపారులపై ప్రభావం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఓ వైపు ఆన్‌లైన్ యాప్స్, మరోవైపు మల్టీనేషనల్ కంపెనీల రాకతో లోకల్ వ్యాపారాలు వెలవెల్లాడుతున్నాయి. తెలుగువారి పెద్ద పండుగల్లో సంక్రాతి ఒకటి. ఈ పండుగకు ప్రతి ఇల్లు బంధువులు, పిల్లపాపలతో కళకళలాడుతుంటుంది. భోగి, సంక్రాంతి, కనుమ ఒకొక్క పండుగకు ఒకొక్క ప్రత్యేకత ఉంది. ఈ పండుగల నేపథ్యంలో పిండి వంటల తయారీ పెట్టింది పేరు. ఈ వంటల తయారీకి 15 రోజుల ముందు నుంచే హడావుడి మొదలవుతోంది. అదే విధంగా దుస్తులు కొనుగోలుకు రాజమహేంద్రవరం, ద్వారపూడి మార్కెట్‌లు ఉభయగోదావరి జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి కొనుగోలు చేయటం పరిపాటి. పండుగలకే కాదు ఏ ఇంట శుభకార్యం జరిగినా రాజమహేంద్రవరంలో దుస్తులు కొనుగోలు చేయటం అనేక కుటుంబాలు క్యూ కడుతుండేవి. సంక్రాంతి వచ్చిందంటే గతంలో రాజమహేంద్రవరంలోని మహాత్మగాంధీ హోల్ సేల్ క్లాత్ మార్కెట్, మెయిన్ రోడ్డు, వెంకటేశ్వర మార్కెట్ తదితర ప్రాంతాలు కళకళలాడేవి. అక్కడికి వెళ్లాలంటే కనీసం అర్థగంట పట్టేది. కిక్కిరిసిన దుకాణాలు, వినియోగదారులు కోలాహలంతో వ్యాపారులు బిజీబిజీగా ఉండేవారు. అయితే పరిస్థితులు ప్రస్తుతం పూర్తిగా తారుమారయ్యాయి. కొనుగోలు దారుల కోసం విక్రేతలు నిరీక్షించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

రాజమహేంద్రవరంలో 180 హోల్‌సేల్ దుకాణాలతో పాటు బెల్లం, చింతపండు, ఉల్లిపాయలు, అపరాలు, ఆయిల్ దుకాణాలు, మరో 100కి పైగా ట్రేడర్లు ఉన్నారు. నిత్యావసర సరుకుల రిటైల్ షాపులు గురించి చెప్పాల్సిన అవసరం లేదు. రాజమహేంద్రదవరంలో ఏ వీధిలో చూసినా కిరాణా వర్తకులు దర్శనమిస్తుంటారు. అదే విధంగా వస్త్ర దుకణాలలో ఏటా సంక్రాంతి సందర్భంగా ఇక్కడ దాదాపు రూ.60 కోట్లు నుంచి రూ.80 కోట్ల వరకూ వ్యాపారం జరుగుతుందని అంచనా. నిత్యావసర సరుకుల వ్యాపారం రూ.50 కోట్ల పైమాటే. ఉభయ గోదావరి జిల్లాల్లో రిటైల్ వ్యాపారులు సైతం సైతం ఇక్కడి హోల్ సేల్ దుకాణాల్లో కొనుగోలు చేసేవారు. అయితే ప్రస్తుతం వీరికి కొన్ని పెద్ద కంపెనీలు నేరుగా సరుకులను అందిస్తున్నాయి. దీంతో హోల్‌సేల్ వ్యాపారం కూడా క్రమ క్రమంగా ఆవిరైపోతోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గడిచిన పదేళ్లలో నగరంలో వివిధ కార్పొరేట్‌కంపెనీలకు చెందిన షాపింగ్‌మాల్స్ వెలిశాయి. ఉప్పుపప్పులతో మొదలై గృహోపకరణాలు, దుస్తులు సైతం అక్కడ లభిస్తున్నాయి. అయా మాల్స్‌లు వినియోగదారులను ఆకర్షించేలా లక్ష్యంతో తగ్గింపు ధరల వల వేస్తున్నాయి. దీంతో అనేక మంది వీటివేపే మొగ్గు చూపుతున్నారు. నిత్యావసర సామగ్రి అవసరమైతే ఇంట్లో ఎవరో ఒకరు వెళ్లి వీటిని కొనుగోలు చేసి తీసుకురావటమనేది గతంలో ఉండేది. అయితే సూపర్ మార్కెట్లలో సరుకులు దుస్తులు, తినుబండాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు సైతం లభ్యమవుతుండటం కుటుంబ సమేతంగా వెళ్లి షాపింగ్ కొనుగోలు చేస్తున్నారు. ఉదాహరణకు ఒక సబ్బు ధర రూ.65 ఉంటే మార్టులో రూ.52కే వస్తోంది. మినపప్పు, కందిపప్పు, చక్కెర, బెల్లం, తదితర వస్తువుల పరిస్థితి ఇంతే. డబ్బులు కూడా ఆదా అవతుండటంతో పైగా రోజువరీ పనులు నుంచి కొంత ఉపశమనం లభిస్తుందనే ఉద్దేశంతో మార్టులకే ఎక్కువ మంది తరలి వెళ్తున్నారు.ఇంటి నుంచి బయటకు వెళ్లిషాపులల్లోను కొనుగోలు చేయటం బిల్లుకోసం నిరీక్షించడం ఆపై ఇంటికి మోసుకురావటం తమ వల్ల కాదనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.ఈ తరుణంలో వస్తువులను క్షణాల్లో ఇంటికి డెలివరీ చేసే యాప్‌లను ప్రముఖ కంపెనీలు రూపొందించాయి. పాలు మొదలుకొని కూరగాయలు, బియ్యం తదితరాలను అర్డర్ చేయటం వీటిలో ప్రత్యేక ఒకరితో మరొకరు పోటీ పడుతూ డిస్కౌంట్‌లు ఆఫర్లనూ అందజేస్తున్నాయి. ఆర్డర్ చేసిన 15 నిమిషాల నుంచి మూడు గంటల్లో సరుకులను ఇంటి ముంగి అందజేస్తుంటంతో ప్రజలు ఎడాపెడా ఆర్డర్లు పెడుతున్నారు. ఇది వ్యాపారులకు ప్రతికూలంగా మారింది.



నగరంలో వినియోగదారులతో కిక్కిరిసిన ఓ షాపింగ్ మాల్

ప్రమాద భరితంగా రహదారి వంతెన

ప్రజాశక్తి- కపిలేశ్వరపురం

మండలంలోని వాకతిప్పలో శివారులో పంట కాలువపై ఉన్న రహదారి వంతెన ప్రమాదకరంగా మారింది. ఎస్ ఆకారంలో ఉన్న ఈ రహదారి మలుపులో వంతెన ఎడమ వైపు రక్షణ గోడ కొంత భాగం కూలింది. రహదారి పక్కన ఏర్పడిన గుంతలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు, రెట్కతులకు, భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ వంతెన మలుపు తిరిగే క్రమంలో ఆదమరచి పక్కకు వెళితే లోతైన పంట కాలువల్లో వాహనాలతో సహా చోడకులు పడిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. ఈ వంతెన మలుపు తిరిగే సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం ఎదురవుతుందో తెలియని పరిస్థితి. ఈ వంతెన రహదారిమలుపు మీదుగా వాకతిప్ప నుంచి నాగుల చెరువుకు వెళ్లే గ్రామాలతో పాటు కోరుమిల్లి, మాచర, శ్రీరాంపురం, గ్రామాల ప్రజలు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ మలుపులో ఉన్న వంతెన రక్షణ గోడ పటిష్టంగా నిర్మించాలని, రహదారి మలుపులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, గ్రామస్తులతో పాటు ప్రయాణికులు, వాహనదారులు, రైతులు, కోరుతున్నారు.




హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

తాళ్లరేవు : సంక్రాంతి సందర్భంగా ముమ్మిడివరం ఎఎంసి మాజీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్న మెగా వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. 24 జట్లు పాల్గొన్న ఈ పోటీలు సోమవారం రాత్రికి క్వార్టర్ ఫైనల్ దసకు చేరుకున్నాయి. గిరియంపేట- ఇంజరం, కోరంగి- రామన్నపాలెం, సీతారామపురం-తోటపేట జట్ల మధ్య పోటీ రసవత్తంరగా సాగింది. జి.వేమవరం- గిరియంపేట జట్ల మధ్య పోటీలో గిరియంపేట విజేతగా నిలిచి సెమీఫైనల్‌కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో వివేకానంద హైస్కూల్ ప్రిన్సిపల్ మొండి భీమశంకర్, గాడి మొగ ఉపసర్పంచ్ కొక్కిలి గడ్డ లోకేష్, టేకుమూడి ఈశ్వరరావు, బొంతు శ్రీనివాస్, మాజీ సర్పంచులు వాసంశెట్టి శ్రీనివాస్ , కడలి శ్రీనివాస్, బర్రె లక్ష్మీ నరసింహరాజు పాల్గొన్నారు.

శతాబ్ది పార్కులో సదుపాయాల కల్పన

పెద్దాపురం :శతాబ్ది పార్కులో సందర్శకులకు ఆనందాన్ని కల్పించే విధంగా సదుపాయాలను కల్పిస్తామని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సోమవారం పార్కును ఆయన ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌తో కలిపి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఈ పార్కు అభివృద్ధి గురించి పట్టించుకోకపోవడంతో పార్కు శిథిలావస్థకు చేరుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పార్కు అభివృద్ధికి కృషి ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, జనసేన నాయకులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న పరిమి బాబు

వాలీబాల్ పోటీలు ప్రారంభం

గండేపల్లి : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని ఎన్‌టి రాజాపురంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో సోమవారం ప్రారంభం అయ్యాయి. పోటీల ప్రారంభ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యురాలు పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు పాల్గొని మాట్లాడారు. పండుగ సందర్భంగా యువత చెడు మార్గాలకు వెళ్లకుండా ఉండేందుకు ప్రతి ఏడాది వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పరిమి బాబు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు మెమెంటోలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కె.చిట్టిబాబు, కోర్పు సాయి తేజ, జాస్తి వసంత్, సుంకవల్లి రమేష్, శివ, చిన్నోడు పాల్గొన్నారు.



సర్పంచ్‌ను సత్కరిస్తున్న గ్రామపెద్దలు

సర్పంచ్ వెంకటేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

నంగవరం గ్రామాభివృద్ధికి ప్రత్యేక కృషి చేసిన గ్రామ సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావును గ్రామ పెద్దలు సోమవారం ఘనంగా సత్కరించారు. సంక్రాంతి సందర్భంగా గ్రామ పెద్దలు ఆకుల వెంకటేశ్వరరావు, ఆకుల రాజబాబు, ఆకుల చిట్టిబాబు సోదరులు వారి కుటుంబ సభ్యులు సర్పంచ్‌ను ఘనంగా సత్కరించారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శీలం సూరిబాబు, జిన్నూరి రాంబాబు, ఆకుల చిట్టి బాబ్జి, జిన్నూరి ప్రభాకరరావు, జి.వెంకట నారాయణ, మానే శ్రీను, జి.శ్రీనివాసరావు, యాళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న 47 మంది పర్మినెంట్ సానిటరీ వర్కర్లకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ దుస్తులు పంపిణీ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా కార్మికులకు 3 చీరలు, జాకెట్లు, మూడు, టవల్స్, పురుషులకు రెండు జతల బట్టలు, మూడు టవల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మంగతాయారు మాట్లాడుతూ ప్రతి ఏడాది మున్సిపాలిటీ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా సానిటరీ వర్కర్స్‌కు వస్త్రాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోకేడ అప్పారావు, సానిటరీ మేస్త్రీలు సూరిబాబు, రాజ బాబు, బుజ్జి, కృపాకర్, సానిటరీ సెక్రటరీ సత్తిబాబు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని తిరుమాలి గ్రామంలో టిడిపి నాయకులు పసల సూరిబాబు, కోరుకొండ నూకరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.



భోగి పండుగలో సందడి చేస్తున్న గ్రామస్తులు

ఘనంగా భోగి పండుగ...

ప్రజాశక్తి - యానాం

భోగి పండుగను ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక మెట్టకూరు రామన్నకోడు గ్రామంలో వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద గ్రామస్తులు భోగి మంటలు వేశారు. కొత్త కాలానికి స్వాగతం పలుకుతూ, భోగిమంటల చుట్టూ చిన్నా పెద్దా కేరింతలు కొట్టారు. పిడకలతో తయారు చేసిన పెద్ద దండను గ్రామస్తులందరూ కలిసి భోగిమంటలో వేశారు. హరిదాసుల ఆటపాటలతో అలరించారు.

ప్రత్తిపాడు : మండలంలో పలు గ్రామాల్లో భోగి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ధర్మవరంలో భోగిమంటను వైసిపి నాయకుడు, ఎంఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ప్రారంభించారు. పల్లెల్లో భోగి పండుగ సందర్భంగా పిల్లలు భోగిమంటలు వేసి ఆనందంగా జరుపుకున్నారు.



ఆటో యూనియన్ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

ఆటో డ్రైవర్లకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - యానాం

యానాం రవాణా శాఖ ఆధ్వర్యంలో సోమవారం రోడ్డు భద్రత వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్త బస్టాండ్‌లో గల ఓపెన్ ఆడిటోరియంలో మెడికల్ క్యాంపు జరిగింది. అనంతరం వాహనదారులకు, ఆటో యూనియన్ వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆటో యూనియన్ సభ్యులతో ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం నుంచి పురవీధుల గుండా వాహనదారులు భద్రత పాటించాలంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఒ కాటే ప్రభాకర్, ఎస్‌పి రాజశేఖరన్, ట్రాఫిక్ ఎస్‌ఐ నూకరాజు, ఎస్ఐ మురుగానందం, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ప్రత్యేక తనిఖీలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా పోలీసులు సోమవారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో మైనర్ వ్యక్తులు నడుపుతున్న వాహనాలను ఆపివేసి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి వాహనాలకు జరిమానాలు రాశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రంగనాథుల కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని కోలంక గ్రామం కేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో గోదానాథుల కళ్యాణ మహోత్సవం జరిగింది. అర్చకులు ఖండవెల్లి శ్రీనివాసచార్యులు, ప్రశాంత ఆచార్యులు ఆధ్వర్యంలో వరదా వెంకటేశ్వరరావు, రామలక్ష్మిభవాని దంపతులచే వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు శేషారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం భోగి పండగ సందర్భంగా గ్రామ సౌభాగ్యం లోక కళ్యాణార్థం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వరద వెంకట నాగేశ్వరరావు, పచ్చిపులుసు సూర్యనారాయణ, వరద సురేష్, పసుమర్తి కనకమహాలక్ష్మి, పుట్టా లావణ్య, వరద రోహిణి, వరద వరుణ్ హన్సిక, సాగి బొజ్జిరాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వాహనాల చోరీ కేసుల్లో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరంతోపాటు పలు ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల చోరికి పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. 39 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం స్థానిక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి రఘువీర్‌విష్ణు వివరాలను వెల్లడించారు. అనపర్తి మండలం పులగుర్త గ్రామానికి చెందిన పసగడుగుల సత్యనారాయణ(పాత నేరస్తుడు)తో పాటు కిర్లంపూడి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన రాజారపు కృష్ణ, పిఠాపురం మండలం విరవ గ్రామానికి చెందిన గుదే మణికంఠ సంయుక్తంగా నగరంలోని కుళాయి చెరువు, డీమార్ట్ వంటి చోట్ల పార్కింగ్ చేసిన మోటార్ సైకిళ్లను దొంగిలించేవారన్నారు. ఆ విధంగా వీరు దొంగిలించబడిన మొత్తం 39 మోటార్ సైకిళ్లను రికవరీ చేసినట్లు చెప్పారు. ముద్దాయి పసగడుగుల సత్యనారాయణ దొంగిలించబడిన మోటార్ సైకిల్తో పోలీసులకు పట్టుబడ్డాడని, ఇతనిని విచారించగా రాజారపు కృష్ణ, గుదే మణికంఠ ఈ చోరీల్లో ఉన్నారని వెల్లడించినట్లు చెప్పారు. ముగ్గురిని అరెస్టు చేసిన కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు. వ్యాయామానికి వచ్చేవాళ్లు తప్పనిసరిగా వారు మోటార్ సైకిళ్లను అపహరణకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో క్రైమ్ సిఐ వి.కృష్ణ, లా అండ్ ఆర్డర్ సిఐ కెవివి.సత్యనారాయణ, త్రీ టౌన్ ఎస్ఐ ఎం.సాగర్‌బాబు, క్రైమ్ ఎస్ఐ వినయ్‌ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి ముమ్మిడివరం

బైపాస్ రోడ్డులో సోమవారం చోటు చేసుకున్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న అరిగెల సత్తిబాబు, ఆయన భార్య కుమార్తెతో కలిసి బైకుపై వెళుతుండగా అనాతవరానికి చెందిన చెందిన బీర ప్రవీణ్ బైకుపై వేగంగా వచ్చి వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన స్థానికంగా ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

పేకాడుతున్న పది మందిపై కేసు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలంలో వివిధ గ్రామాల్లో పేకాట శిబిరాలు, కోడిపందేల పై పోలీసులు దాడి చేసి పది మందిపై కేసులు నమోదు చేశారని ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు. వారి నుంచి 5,940 నగదును, రెండు కోడి పుంజులు, రెండు కత్తులు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కోడిపందేలు ఆడుతున్న 12 మంది అరెస్ట్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలో కోడి పందేల శిబిరాలపై దాడులు నిర్వహించి 12 మందిని అరెస్టు చేశామని ఉండ్రాజవరం ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం భోగి పండుగను పురస్కరించుకుని, మండలంలోని చివటం, పాలంగి, ఉండ్రాజవరం తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరాలపై సిబ్బందితో దాడి చేసి, 4 కేసులు నమోదు చేసి 12 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ.6,300 నగదు, 4 కోడి కత్తులు, 4 కోళ్ల స్వాధీనం చేసుకున్నామన్నారు.

మామిడి తోట దగ్ధం

ప్రజాశక్తి - తొండంగి

మండలంలోని కొమ్మనాపల్లిలో కొంతమంది రైతులకు సంబంధించిన నాలుగున్నర ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోట దగ్ధం అయింది. సంబంధిత రైతులు కోన వెంకట్రావు, కుర్ర రాంబాబు, కుర్ర సత్తిబాబు, కుర్ర నాగబాబు మాట్లాడుతూ నాలుగున్నర ఎకరాల్లో కొన్నిళ్లుగా సాగు చేసుకుంటున్నామని, అయితే పక్క గ్రామంలో ఉన్న కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు వైర్లను కాలుస్తుంటారని, తద్వారా వచ్చిన రాగిని ముద్దగా చేసి అమ్ముకుంటారని చెప్పారు. ఆదివారం రాత్రి వైర్లను కాల్చడం వలన అవి క్రమేపి పక్క తోటలో మంటలు వ్యాపించి ఉన్న చెట్లన్నీ కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పూత దశలో ఉన్న మామిడిచెట్లతోపాటు, ఎకరం పొలంలో వేసిన పశుగ్రాసం కూడా దగ్ధం అయిందన్నారు. సుమారు రూ.2 లక్షల వరకూ నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. పోలీసులు, ఉద్యానవన శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని స్థానికులు కోరారు.

టిటిడిలో పగడాల సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - ఆలమూరు

తిరుమల తిరుపతి దేవస్థానంలో దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి పగడాల ఆనంద తీర్థాచార్యుల సేవలు ఎనలేనివని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ప్రశంసించారు. మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద తీర్థాచార్యుల ప్రసంగ కార్యక్రమం సోమవారం ఆలయ కమిటీ ఏర్పాటు చేయగా ఎంఎల్ఎ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల వెంకన్న ప్రసంగాలు, సేవలు ప్రజలందరికీ చేరువవుతాయని తెలిపారు. అనంతరం ఎంఎల్ఎ సత్యానందరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఒంటిపల్లి పాపారావు, ఆలయ కమిటీ సభ్యులు తీర్థాచార్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబు, సాలి సత్యనారాయణ, కేతా రాంబాబు, ముప్పిరి వెర్రియ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

ఆకట్టుకున్న అప్పన్న ఎద్దు విన్యాసాలు

ప్రజాశక్తి - సామర్లకోట

సంక్రాంతి సందర్భంగా డూడు బసవన్న అప్పన్న ఎద్దు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మండలంలోని వేట్లపాలెం గ్రామం జొన్నలదొడ్డి ప్రాంతంలో భోగి పండుగ సందర్భంగా ఎద్దుతో అప్పన్న చేయించిన విన్యాసాలు చూపర్లను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నాలుగు కాళ్ల గల మొక్కలు పీటపై ఎద్దు నాలుగు కాళ్ల నుంచి రెండు నిమిషాల పాటు కదలకుండా నిలబడి అందర్నీ ఆకర్షించింది. అలాగే పెద్దలకు బుర్ర వంచి నమస్కారాలు చెప్పింది. అలాగే నిర్వాహకుడు వెళ్ళమన్న ఇంట్లోకి కుడికాలు పెట్టి వెళ్లి తిరిగి బయటికి వచ్చింది. సంక్రాంతి సందర్భంగా శిక్షణ పొందిన అప్పన్న ఎద్దు విన్యాసాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి.

మరిడమ్మ ఆలయంలో భోగి పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో సోమవారం చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో అర్చన చేశారు. పిల్లలకు భోగి పళ్ళు, అమ్మవారికి ఉయ్యాల ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, ఆలయ ఆసాధులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.